'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్'కు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'కాన్షియస్ లివింగ్ ఫర్ స్టిల్‌నెస్ వితిన్' అనే అంశంపై ముంబాయికి చెందిన స్పిరిచ్యువల్ ఆదర్, కోచ్, ఫెసిలిటేటర్ బికె రీతు తక్కర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

జోనల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలో 6వ ఫేజ్‌లోని పీవీఎస్ఆర్ పార్కులో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

23 నుంచి హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 23న హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ నటులు స్రవంతి చొక్కారపు, చాందిని భగ్వనాని, పలువురు మోడల్స్ పాల్గొని సందడి చేశారు. ఎగ్జిబిషన్‌లో లభించి డిజైనరీ దుస్తులతో పాటు వజ్రాభరణాలను ధరించి హొయలు పోయారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలు ప్రదర్శిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 43 మంది లబ్ధిదారులకు మంజూరైన 20లక్షల 47 వేల రూపాయల చెక్కులను గురువారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. , కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, సాంబశివరావు, మంత్రిప్రగడ సత్యనారాయణ, పోతుల రాజేందర్, ఎండి ఇబ్రహీం, కావూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చివరికి ఇలా..

నిధులున్నా అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటిక

చందానగర్ : శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. మాదాపూర్ డివిజన్ పరిధి కృష్ణ కాలనీ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించినా పనులు జరగడం లేదు. గత సంవత్సరం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శ్మశానవాటికను పరిశీలించి ప్రత్యేక నిధులు రూ.10 లక్షలు కేటాయించారని, ప్రహరిగోడ కట్టి వదిలేశారని కాలనీ వాసులు తెలిపారు. కాలనీవాసులు తమ సొంత నిధులతో శ్మశానవాటిక ప్రధానగేటు, చిన్న నిర్మించుకున్నారు. శ్మశానవాటికలో కార్లు, ఆటోలు భారీ వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఇక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కృష్ణకాలనీ శ్మశానవాటికలో వాహనాల పార్కింగ్



శ్మశానవాటికలో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న షెడ్డు, ప్రధాన గేటు

ప్రధానగేటు మేమే నిర్మించుకున్నాం



శ్మశానవాటిక అభివృద్ధి గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన ప్రత్యేక నిధులు 10 లక్షలు కేటాయించారు. పనులు జరగలేదు. దాతలు, కాలనీవాసుల సొంత డబ్బుతో గేటు, షెడ్డును నిర్మించుకున్నాం.

– కృష్ణ యాదవ్, కృష్ణ కాలనీ

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అసంపూర్తి పనులు



కృష్ణ కాలనీ శ్మశానవాటిక కాంట్రాక్టర్ వల్లనే పనులు జరగలేదు. రెండు వైపులా ప్రహరిగోడ నిర్మించి వదిలేశాడు. కనీస వసతులు లేవు. వర్షాకాలం శ్మశానవాటికలో ఇబ్బందులు కలుగుతున్నాయి. వెంటనే ప్రజాప్రతినిధులు వసతులు కల్పించాలి.

– హరి, కృష్ణ కాలనీ

ఫలితాల్లో టాప్.. జవహర్ నవోదయ విద్యాలయాలు

- దేశంలోనే హైదరాబాద్ రీజియన్ అగ్రస్థానం
- రీజియన్‌లో టెన్త్‌లో 77 జేఎన్‌వీలలో 73 జేఎన్‌వీలు 100 శాతం పాస్
- 12వ తరగతితో 76 జేఎన్‌విలో 70 జేఎన్‌వీలు 100 శాతం పాస్

రాయదుర్గం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన, ఇంగ్లిష్ మీడియం విద్యను అందించాలనే తపనతో ఏర్పాటు చేసిన నవహర్ నవోదయ విద్యాలయాలు ఫలితాల్లో టాప్‌లో నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖ పర్యవేక్షణలో ఉండే జేఎన్‌విల పర్యవేక్షణకు నవోదయ విద్యాలయ సమితిని ఏర్పాటు చేశారు. దేశాన్ని 8 రీజియన్లుగా విభజించారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయాలు దేశంలోనే మొదటిస్థానంలో నిలిచాయి.

8 రీజియన్లలో 641 జేఎన్‌వీలు

దేశంలో 27 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలలో 641 జవహర్ నవోదయ విద్యాయాలు ఉన్నాయి. హైదరాబాద్ రీజియన్‌లో 77 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 641 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 44,307 మంది విద్యార్థులకు గాను 44,083 మంది ఉత్తీర్ణులయ్యారు. 99.49 శాతం ఉత్తీర్ణులయ్యారని అధికారులు తెలిపారు.

నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్‌లో..

వివరాలు	పదవతరగతి	12వ తరగతి
మొత్తం జేఎన్‌వీలు	77	76
పరీక్షలకు హాజరైన విద్యార్థులు	5565	3196
పాసైన విద్యార్థులు	5561	3184
గైర్హాజరు	6	4
మొత్తం ఫలితాల వివరాలు	99.92	99.62



గోపన్‌పల్లిలోని నవోదయ విద్యాలయ సమితి కార్యాలయం

ప్రతి విద్యార్థినీ తీర్చిదిద్దడమే లక్ష్యం



ప్రతి విద్యార్థిని పరిపూర్ణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌విఎస్) పనిచేస్తోంది. కేవలం అకడమిక్‌గానే కాకుండా క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్, సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థులు రాణించేలా చూస్తున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సీబీఎస్ఈ విద్యను అన్ని అధునాతన సౌకర్యాలతో కూడిన విద్యాలయాల్లో అందించేలా జేఎన్‌వీలను రూపొందించారు. ప్రస్తుతం వరుసగా మూడవ ఏడాది కూడా హైదరాబాద్ రీజియన్ దేశంలోనే 10,12 తరగతుల ఫలితాలలో దేశంలో టాప్‌గా నిలిచాం. దీనికి ఉపాధ్యాయుల చొరవ, విద్యార్థుల పట్టుదల కారణం.

– గోపాలకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్

కేన్సర్‌పై అవగాహన అవసరం

మణికొండ: ఆహారపు అలవాట్ల వల్లే అనేక రకాల కేన్సర్‌లు వస్తున్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ముందుచూపుతో వ్యవహరిస్తే రాకుండా చూసుకోవచ్చని భారత్ వికాస్ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘు సతీష్ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 500 మంది మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు కేన్సర్‌పై అవగాహన సదస్సు, అనీమియా ముక్త్ భారత్ క్యాంప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ వస్తువుల వాడకం పెరగటం, ఆహార పదార్థాల ఉత్పత్తిలో రసాయనాలు ఎక్కువగా వాడటంతో ఎక్కువ మందికి పలు రకాల కేన్సర్‌లు వస్తున్నాయన్నారు. వాటి వాడకాన్ని నివారించి ఆరోగ్యాన్నిచ్చే వస్తువులనే ఎక్కువగా వాడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రతి సంవత్సరం కేన్సర్ పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సలహాలను పాటించాలన్నారు. డాక్టర్ గీతానాగశ్రీ, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు బీరప్ప, సిద్ధప్ప, రాఘవరెడ్డి, జిజాబాయి బ్రాంచ్ చీఫ్ ప్యాట్రన్ ఎస్‌బీ రాజశేఖర్, సలహాదారుడు ప్రభూజీ, అధ్యక్షుడు పెంటారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.బాలభారతి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 100, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

పూడికతీత పనులు పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ నుంచి ఎల్లమ్మ చెరువు వరకు ఉన్న ఓపెన్ నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఏఈ శ్రావణితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడికతీత పనులను వర్షాకాలానికి ముందుగానే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, జగదీష్, పోశెట్టి గౌడ్, రవీందర్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



చందానగర్ : హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గురువారం చందానగర్ డివిజన్ పరిధి కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి నివాసంలో వారికి ఎమ్మెల్యే గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యాత్రికులు అక్తర్, అక్బర్ ఖాన్, ఖలీద్, నమీమ్, షమీ, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నరేందర్ బల్లా, అంజాద్ పాషా, యూసుఫ్ పాషా, అలీ బాయ్, ఖలీద్ పాషా, సాజిద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి దాదాపు అరగంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, ఆరాంఘర్, రాజేంద్రనగర్ రేడియం రోడ్డు, హనుమాన్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు రోడ్లపై నిలిచిపోయి స్థానికులతో పాటు వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వరదనీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడంతో ప్రతిసారి ఈ సమస్య తలెత్తుతోంది. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం

యువకుడిపై కేసు నమోదు

గచ్చిబౌలి: రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్‌పై వచ్చిన యువకుడిని అడ్డుకోవడంతో ట్రాఫిక్ ఎస్ఐ చేతిలోని ట్యాబ్ లాక్కొని విధులకు ఆటంకం కల్గించడంతో అతనిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, హోంగార్డులు గురువారం ఉదయం 11 గంటల సమయంలో శ్రీరాంనగర్ కాలనీలోని యూటర్న్ వద్ద విధులు నిర్వహిస్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన అభిషేక్ గుప్తా అనే వ్యక్తి బైక్‌ను ఆపారు. రాంగ్ రూట్‌లో వచ్చినందుకు చలానా వేయాలని ఫోన్ నెంబర్ చెప్పాలని అడగగా ఆయన పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ట్రాఫిక్ ఎస్ఐ చేతిలోని ట్యాబ్‌ను లాక్కొని దురుసుగా ప్రవర్తించాడు. బైక్‌ను ఆపే హక్కు ట్రాఫిక్ పోలీసులకు లేదని చిందులు వేశాడు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మియాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ ఫేజ్–4లో నివాసముంటున్న కలిశెట్టి రామలింగేశ్వర విశ్వనాథ్ (56) చందానగర్‌లోని ముకుంద జువెలరీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 13వ తేదీ విశ్వనాథ్ డ్యూటీకి వెళ్లి రాత్రి 10 గంటల సమయంలో ఉద్యోగం ముగించుకుని స్కూటీపై హఫీజ్‌పేట్ మంజీరా రోడ్డులో వెళ్తుండగా సప్తగిరి కాలనీ దగ్గరకు రాగానే బండి జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చూసి కుమారుడు శివతేజకు సమాచారం అందించగా తండ్రి విశ్వనాథ్‌ను దగ్గర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం విశ్వనాథ్ మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారులు శివతేజ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుంతల రోడ్లు .. ప్రయాణించేదెలా..?



దీప్తిశ్రీనగర్ కాలనీలో కంకర తేలిన రోడ్డు

మియాపూర్: గుంతలరోడ్లతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చందానగర్ డివిజన్ పరిధి శాంతినగర్ కాలనీ ప్రధానరోడ్డు గుంతలమయంగా మారింది. శాంతినగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి ఆకస్మాత్తుగా రోడ్డు కుంగిపోయింది. జలమండలి అధికారులు ఆ ప్రాంతంలో రోడ్డు తవ్వి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తయిన తర్వాత మట్టి వేసి వదిలేశారు. వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతంలో గుంతలు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్నా రోడ్డు తవ్విన ప్రాంతంను బాగు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.అలాగే దీప్తిశ్రీనగర్ కాలనీలో ప్రధాన సర్కిల్ వద్ద రోడ్డు గుంతలు పడడంతో బాటు కంకర తేలడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శాంతినగర్ ప్రధానకాలనీలో గుంతలు పడ్డ రోడ్డు

రాకపోకలకు ఇబ్బందిగా..



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో 20 ఫీట్ల రోడ్డులో ఆరు ఫీట్ల మేర మూల మలుపులో విద్యుత్, కేబుల్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. కాగా ఈ స్తంభాల్లో ఒకటి పాతికేళ్ళ క్రితం వేసినది కావడంతో కొత్త స్తంభం ఏర్పాటు చేసినా ఆ స్తంభాన్ని అలాగే వదిలేశారు. ఇక కేబుల్ వైర్లు వీటికే ఏర్పాటు చేయడంతో మూల మలుపు కావడం, రోడ్డు చిన్నదిగా ఉండటంతో ట్రాక్టర్లు, వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. అవసరం లేని వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

రేపటి నుంచి శృంగేరి శంకరమఠం వార్షికోత్సవాలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠం 26వ వార్షికోత్సవాలను శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు గురువందనం, గురుపాదుకా పూజ, కలశ స్థాపన, 10 గంటలకు రుద్ర హోమం, సాయంత్రం 6 గంటలకు గానామృత తరంగిణి వారిచే శ్రీ భారతీ తీర్థ విరచిత శ్రీ శారదా పంచరత్న స్తుతి, 6:30 గంటలకు బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణశర్మచే లీలాశుక విరచిత శ్రీకృష్ణకర్ణామృతం ప్రవచనం, ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ లలితా హోమం, సాయంత్రం 6 గంటలకు పద్మా హేమమాలిని ఆధ్వర్యంలో నవావరణ కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, సోమవారం ఉదయం 7 గంటలకు శ్రీ శారదా చంద్రమౌళీశ్వరులకు మహాన్యాస పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు శ్రీ శారదా అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు శృంగేరి శంకరమఠం ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా సాగుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో టీయుఎఫ్ ఐడీసీ రూ.15 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, రక్షిత మంచినీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరుడివిజన్ పరిధిలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షులు మనోహర్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని తన నివాసంలో కలిసి ఈనెల 22 వ తేదీన జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు విరూపాక్ష, కంకర్ శ్రీను, విజయ్, ప్రసాద్ రమేష్, మూర్తి పాల్గొన్నారు.

'చాయ్ అడ్డా' ప్రారంభం

ప్రారంభించిన సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్

రాయదుర్గం : నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో హైదరాబాదీ చాయ్ అడ్డాను సినీ సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ ఈ తరం యువత ఉద్యోగాలు సైతం వదలి టీ వ్యాపారంలో దూసుకుపోయేందుకు సరదా పడుతున్నారన్నారు. చాయ్‌కు కొత్త నిర్వచనాన్ని చెబుతూ యువతకు కార్పొరేట్ స్థాయి వ్యాపారం చూపించేలా నటుడు అభినవ్ సర్దార్ హైదరాబాదీ చాయ్ అడ్డాను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, నిర్మాత లగడపాటి శ్రీధర్, జెమిని సురేష్, నటులు లోహిత్‌కుమార్, షానీ పలువురు మోడల్స్, టీవీ కళాకారులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణం కూల్చివేత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో సెట్టిగుంట చెరువు భూమి పరిధిలో నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చేశారు. ఈ ప్రాంతం సెట్టిగుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని హెచ్చరించారు. ఇక్కడ ఎవరు నిర్మాణాలు చేపట్టకూడదని టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ తెలిపారు. అనుమతిలేని నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

వరదనీటి సంప్‌లు.. సత్ఫలితాలు

- ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో భారీ సంప్ నిర్మాణం
- వరద నీటిని నాలుగు గంటల్లోనే ఖాళీ చేస్తున్న మోటార్లు
- మరిన్ని చోట్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు

బంజారాహిల్స్: భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై వరదనీరు నిలవకుండా నిర్మించిన రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మొదటి ఫేజ్ కింద జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో నిర్మించారు. రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌తో పాటు సోమాజిగూడ ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో, సచివాలయం సమీపంలో నిర్మించారు. ఈ క్రమంలో భారీ వర్షాలకు గతంలో వరద తీవ్రత కనిపించడం లేదు. మార్చి 3వ తేదీ మూడు గంటల్లోనే 9 సెంటీమీటర్ల వర్షం కురవగా, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు రెండు చోట్ల నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ వద్ద వరదనీరు ఎప్పటికప్పుడు సంప్‌ల్లోకి చేరుకుంది. రాజ్‌భవన్ రోడ్డులో గతంలో 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే ట్రాఫిక్ స్తంభించిపోయి రాకపోకలు నిలిచిపోయేవి. కానీ మార్చి 3న 9 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదైనా పెద్దగా ఇబ్బంది కలగలేదు.



రాజ్‌భవన్ రోడ్డు లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు నిర్మించిన రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్

ఆర్టీఏ ఆవరణలో మరో సంప్ నిర్మాణం..

- ఈ వరదనీటి సంప్‌ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు.
- ఈ హోల్డింగ్ స్ట్రక్చర్లను 10 లక్షల లీటర్ల నీటిని స్టోర్ చేసుకునేలా నిర్మించారు. భారీ వరదలకు 10 లక్షల లీటర్ల నీటిని ఈ సంప్‌లు తీసుకోగలుగుతున్నాయి.
- ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల సంప్‌ను నిర్మిస్తున్నారు.
- మెర్క్యూరీ హోటల్ ముందు నిర్మించిన సంప్‌లో వరదనీరు నిలవగానే నేరుగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న సంప్‌లోకి మళ్లిస్తారు. దీంతో ఒక్క చుక్క కూడా నీరు నిలవకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- నీరు నిండగానే తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ 25 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న మీటర్లను బిగించింది.
- సంప్ నిండగానే నాలుగు గంటల్లోనే ఖాళీ చేస్తున్నారు.
- ఇక రెండో దశలో వాటర్ లాగింగ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, సోమాజిగూడ, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో కూడా వరదనీటి సంపుల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.